క్లుప్తంగా

కొనసాగుతున్న వ్యాధి నిరోధక టీకాలు



అయిజ: పశువులకు, జంతువులకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం మండలంలోని కొత్తపల్లి, అయిజ శివార్లలో గొర్రెలకు, మేకలకు చిటుక రోగం రాకుండా ఉండేందుకు వెటర్నరీ సిబ్బంది ఈటీ వ్యాక్సినేషన్ వేశారు. కేశవరంలో పశువులకు గురుక వ్యాధి, జబ్బ వాపు వ్యాధులు రాకుండా ఉండేందుకు హెచ్ఎస్, బీక్యూ వ్యాక్సినేషన్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూప రాణి సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

అయిజ: విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత పడిన సంఘటన మండలంలోని ఉప్పలలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పల గ్రామానికి చెందిన రైతు తెలుగు చిన్న శంకర్‌కు సంబంధించిన గేదె ఉప్పల శివారులోని పెద్దవాగు వద్ద గడ్డి మేస్తూ ఉండగా, భూమిపై పడిఉన్న విద్యుత్ వైర్లు గేదె కాలుకు తాకడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. దాని విలువ రూ.40 వేలు ఉంటుందని, గేదె పాలతో జీవనం సాగించే వారని బాధితుడు పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు.

డ్రెయినేజీలు శుభ్రం



సాక్షి ఎఫెక్ట్..


శాంతినగర్: గత సోమవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీల్లో మురుగు తొలగించే ప్రక్రియ మొదలుపెట్టారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులో డ్రెయినేజీల సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారని, గత సోమవారం 'సమస్యలు పట్టించుకునేదెవరు' అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో కథనం వెలువడింది. పైపాడులోని 1,2 వార్డుల్లో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన షిల్టును జేసీబీతో తొలగించారు. మసీదు నుంచి వాగు వరకు ఇరువైపుల ఉన్న డ్రెయినేజీ కాల్వల్లో పేరుకుపోయిన షిల్టును తొలగించారు. దీంతో పైపాడు వాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

తప్పిన ప్రమాదం



వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో బుధవారం సాయంత్రం ముంత కుర్మయ్యకు చెందిన మట్టి మిద్దె అకస్మాత్తుగా కూలి నేలమట్టం అయ్యింది. అతడు భార్య కృష్ణమ్మతో కలిసి ఇంటి ఆరుబయట ఉన్న సమయంలో మట్టి మిద్దె కూలడంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి జీవనాధారం లేని నిరుపేద కుటుంబానికి చెందిన వీరి మిద్దె కూలిపోవడంతో వీధిన పడ్డారని, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయ పరిసరాల్లో తొలగని వ్యర్థాలు



అమరచింత: పట్టణంలోని సవారమ్మ ఆలయం ఆవరణలోని కోళ్ల వ్యర్థాలు తొలగించకపోవడంతో ఆలయ పరిసరాలు దుర్గంధంగా తయారయ్యింది. మంగళవారం సవారమ్మ జాతర సందర్భంగా పట్టణ ప్రజలు అమ్మవారిని దర్శించుకుని కోళ్లను బలిచ్చి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాల్లోనే కోళ్ల వ్యర్థాలను పారవేయడంతో పరిసరాలంతా కోడి ఈకలు, రక్తపు మరకలతో నిండుకున్నాయి. దీంతో కుక్కలు సైతం అక్కడే ఉంటూ కోళ్ల వ్యర్థాలను తింటూ ప్రధాన రహదారిపై ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులపై ఎగబడుతున్నాయి. మున్సిపాలిటీ అధికారులు ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించకపోవడంతోనే ఆలయ పరిసరం అధ్వానంగా తయారైందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కౌలు రైతుల కష్టాలు తీరేనా?

- సాగులో కీలకం.. అయినా అరకొరగా గుర్తింపు
- సంక్షేమ ఫలాలు, బ్యాంకు రుణాలు దూరం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



చెన్నిపాడు శివారు ప్రాంతంలో కౌలు పొలాన్ని దుక్కిదున్నుతున్న రైతు

మానవపాడు: ఆరుకాలం కష్టపడి, పంటలు సాగు చేస్తున్నా, తగిన ప్రతిఫలం దక్కడం లేదు. కౌలు రైతుల కష్టాలు తీరడం లేదు. రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. సంక్షేమ పథకాలు, బ్యాంకుల ద్వారా రుణాలు సైతం అందడం లేదు. 'వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నాం' అని చెబుతున్నా సర్కార్ ప్రకటనలకే పరిమితమవుతోంది. క్షేత్రస్థాయిలో కౌలు రైతులను మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో వారు ఏటా సాగు సమయంలో అష్టకష్టాలు పడాల్సివస్తోంది. వాస్తవంగా మండలంలో ఎక్కువ పంటలను సాగు చేసేది కౌలు రైతులే. మండలంలో ఐదేళ్ల క్రితం ఎకరా మెట్ట భూమికి రూ. 5వేల నుంచి రూ.10వేల వరకు కౌలు ధర ఉండేది. ఏటేటా భూ యజమానులు పెంచుతూ ఉండటంతో ప్రస్తుతం ఎకరాకు రూ. 20వేల నుంచి రూ. 40వేల వరకు పెరిగింది. గతంలో నీటి లభ్యత అంతంత మాత్రంగా ఉండేది. తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా కాల్వలకు నీటి సౌకర్యం వచ్చినప్పటి నుంచి భూముల కౌలురేట్లు పెరిగిపోయాయి. సాగుకు 24గంటల ఉచిత విద్యుత్ సౌకర్యంతో రైతులు ఇబ్బందులు లేకుండా ఉంటాయని, భూమిని కౌలుకు తీసుకోవడానికి ఇతర వ్యక్తులతో పోటీపడి మారి ఎక్కువ ధరకు తీసుకుంటున్నారు.

ఎకరాకు రూ.20వేలు పైమాటే..

మండల వ్యాప్తంగా దాదాపు 38వేల ఎకరాల భూమిని వ్యవసాయానికి సాగు చేస్తున్నారు. వారిలో దాదాపు 40శాతం పైగా కౌలుకు పొలం తీసుకుంటున్నారు. మిర్చి 9వేల ఎకరాలు, పత్తి 10,800, కంది, మొక్కజొన్న, పొగాకు తదితర పంటలను సాగుచేస్తున్నారు. కౌలు రైతులు అత్యధికంగా మిరప, పత్తి పంటలను సాగుచేస్తున్నారు. వాణిజ్యపంటలపై ఎక్కువగా మిరప, పత్తి పంటలను సాగు చేస్తూ పంటను పండించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. గతేడాది మిర్చి ఆశించిన స్థాయిలో రేటు రాకపోయిన ఈసారైనా వస్తుందేమోనని ఒకే దఫాలో కౌలు కొంతమంది, మరికొంతమంది వడ్డీ చెల్లింపు, మరికొందరూ పంట దిగుబడి వచ్చిన తర్వాత కౌలు చెల్లించి పంటను సాగు చేస్తున్నారు.

భూ యజమానులకే లబ్ధి..

గత ప్రభుత్వం భూ యజమానులకే అండగా నిలిచిందని, కౌలు రైతులకు మొండి చేయి చూపించిందని కౌలు రైతులు వాపోతున్నారు. భూమిని కౌలుకు తీసుకున్నందుకు తాము ఎకరాకు రూ.12వేల నుంచి 40వేల వరకు చెల్లిస్తుండగా, గత ప్రభుత్వం కూడా భూమి యజమానులకే రైతుబంధు పేరిట ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ. 10వేలు చెల్లించిందన్నారు. విత్తనాలు, ఎరువులు, రేట్లు ధరలు పెరిగినా, కొనుగోలు చేసి పంట వేస్తే, నల్లి, తామర పురుగు, తెగుళ్ల కారణంగా పెట్టుబడి పెరగటంతో పాటు దిగుబడి తగ్గిపోతుందని చెబుతున్నారు. వాతావరణం అనుకూలించకపోవడం, మార్కెట్‌లో ధరలు వ్యత్యాసం కారణంగా ఒక్కోసారి భారీగా నష్టపోవాల్సి వస్తోందని కౌలు రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం కరుణించేనా..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరిట భూ యజమానులకే ఆర్థిక సాయం అందించి కౌలు రైతులను పట్టించుకోలేదు. దీంతో వేల మంది కౌలు రైతులకు నిరాశే ఎదురైంది. భూ యజమానులు కౌలు రైతుల దగ్గర కౌలు, ప్రభుత్వం నుంచి రైతు బంధు రెండు తీసుకుంటున్నారు. కౌలు రైతుకు పంట పెటుబడి సాయం అందించే దిక్కు లేకుండా పోయింది. సరైనా పంటల దిగుబడి లేక.. వర్షాలు లేక పంటలు పండక కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం కౌలు రైతులకు న్యాయం చేసే నిర్ణయాలను తీసుకోవాలని కోరుతున్నారు.

రూ. 35వేలు తీసుకున్నాం..



మండలంలోని గోకులపాడు గ్రామ శివారులో రూ.35వేల ఎకరా చొప్పున దాదాపు 10 ఎకరాలకు కౌలుకు తీసుకొని రూ.3.50లక్షలు చెల్లిస్తున్నాం. మిర్చి రేటు ఎక్కువ ఉన్నందుకు రేటు ఎక్కువ పెట్టాం. రేటు తగ్గిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కౌలు రైతులకు న్యాయం చేయలేదు. ఈ ప్రభుత్వమైనా కౌలు రైతులకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నాం.

– రవికుమార్, రైతు గోకులపాడు

కౌలు రైతులను ఆదుకోవాలి



తెలంగాణ ప్రభుత్వం కౌలు రైతులకు చట్టం తీసుకురావాలి. కౌలు పత్రం ద్వారా నిజమైన కౌలు రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, లిక్విడ్ మందులు ప్రభుత్వం నుంచి సబ్సిడీలో అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. భూములు కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నాం. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి.

– మద్దిలేటి, రైతు చెన్నిపాడు

రైతులకు కంది విత్తనాలు అందిస్తాం



మానవపాడులో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి



డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు

శాంతినగర్: వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు కావాల్సిన విత్తనాలు డీలర్ల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్‌నాయక్‌ను జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు నాగరాజు కోరాడు. బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారిని కలిసిన ఆయన రైతులకు అవసరమైన విత్తనాల విషయమై వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూఎస్ పత్తి రకం 7067, మిరప విత్తనాలు నూజివీడు ఆద్యా రకం, బీఏఎస్ఎఫ్ ఆర్మూర్ రకం, 2222 రకం విత్తనాలను రైతులు ఎక్కువగా సాగుచేస్తారని, ఆయా రకాల విత్తనాలు డీలర్ల వద్ద అందుబాటులో వుండేలా చూడాలన్నారు. అంతేగాక ప్రతి విత్తనాల దుకాణంలో రోజువారి స్టాక్ బోర్డులు రాసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని డీలర్లు విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తారని, రైతులు నష్టపోతారని వివరించారు. అంతేగాక ఫౌండేషన్ సీడ్ రాశి, నూజివీడు కావేరి రకాలు రైతులకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, జిల్లా అధికారులు దృష్టిసారించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

మానవపాడు: తాండూర్ కంది (టీడీఆర్‌జీ) అనే రకం విత్తనాలు 250 ఎకరాలకు ఇక్రిశాట్ హైదరాబాద్, కృషి విజ్ఞాన్ కేంద్రం మదనాపురం వారి సౌజన్యంతో ఉచితంగా పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో రైతువేదిక నందు రైతులకు అవగాహన కల్పించారు. మానవపాడు, చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు, కొర్విపాడు గ్రామాలకు జూన్ మాసంలో మధ్యలో కంది విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ఒక్కో ఎకరానికి 3కేజీల విత్తనాలు ఇస్తామన్నారు. విత్తన దిగుబడి పంట 10 క్వింటాళ్ల వరకు వస్తుందిని తెలిపారు. దీనికి ప్రత్యేక అధికారి ఉంటారని, పూత కాయ దశలో శాస్త్రవేత్తలు పరిశీలిస్తారన్నారు.

నాణ్యమైన విత్తనాలు తీసుకోవాలి

ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలను రైతులు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి సూచించారు. గడువు ముగిసిన విత్తనాలను తీసుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని, అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు పలు ప్రశ్నలు, సలహాలు వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.

అలంపూర్: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి అనిత అన్నారు. అలంపూర్ పట్టణంలో సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు జీలుగ విత్తనాలు అందజేశారు. 30 కేజీల బస్తా మొత్తం ధర రూ. 2790గా ఉందన్నారు. ఇందులో రైతులకు రూ.1674 సబ్సిడీ వస్తుందన్నారు. రైతులు రూ.1,116 చెల్లించి జీలుగ విత్తనాలను పొందవచ్చన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మోహన్ రెడ్డి, పీఏసీఎస్ కార్యదర్శి కేశవరెడ్డి, ఏఈఓ, రైతులు ఉన్నారు.



అలంపూర్‌లో జీలుగ విత్తనాలు అందిస్తున్న అనిత

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



కేటీదొడ్డి: నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని ఏడీఏ సంగీతలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని నందిన్నెలోని గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. విత్తన బిల్ బుక్, స్టాక్ రిజిస్టార్, విత్తనాల, ఎరువులు ఎక్కడి నుంచి తెచ్చారో వాటి పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలని, ఎమ్మార్పీకి మించి విత్తనాలు అమ్మితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట ఏఓ మహాలక్ష్మి, గ్రోమోర్ సెంటర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

లూజు విత్తనాలను కొనవద్దు



గట్టు: రైతులు లూజు విత్తనాలను కొనుగోలు చేయొద్దని వ్యవసాయ విస్తరణ అధికారి భక్తవత్సల రైతులకు సూచించారు. బుధవారం లింగాపురంలో విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సీజన్ ప్రాంభమైన తరుణంలో రైతులు విత్తన కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తక్కువ ధరకు వస్తున్నాయని, లూజు విత్తనాలను కొని మోస పోవద్దని రైతులకు సూచించారు.

వ్యక్తి మృతి

మానవపాడు: ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇటిక్యాల మండలం తిమ్మాపురం గ్రామంలో లింగారెడ్డి (24) మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన ఒక కుటుంబం తిమ్మాపురం గ్రామంలో నివాసం ఉంటుంది. ఆ కుటుంబంలోని వ్యక్తులు ఒక కార్యక్రమం నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంటి వద్ద లింగారెడ్డి మాత్రమే ఉన్నట్లు సమాచారం. కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై స్థానికులకు సమాచారం ఇవ్వగా కుటుంబ సభ్యుల అనుమతితో ఇంటి తలుపులు పగటగొట్టి చూడగా, లింగారెడ్డి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

మహిళ అదృశ్యం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన కుర్వ పద్మమ్మ ఆదివారం సాయంత్రం నుంచి కనబడట్లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పామిరెడ్డిపల్లికి చెందిన కుర్వ నాగమల్లయ్య, పద్మమ్మ దంపతులు. పద్మమ్మ ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిందని కుమారుడు శివ తెలిపాడు. అప్పటి నుంచి ఆమె తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పద్మమ్మ ఆచూకీ తెలిస్తే 84669 36959 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

సమాజానికి వారధిగా ఉండాలి



ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

మదనాపురం: ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములవ్వాలని రిటైర్డ్ హెచ్ఎం కురుమయ్య అన్నారు. దుప్పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు బుధవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాడు పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ వృత్తిలో స్థిరపడ్డ అంశాలను వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఎవరూ అధైర్య పడకుండా చేపడుతున్న పనిని నమ్మకంగా కొనసాగిస్తూ మంచి స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. నాడు పాఠశాలలో చదువుకొని కలిసి ఉన్నట్లుగానే ఎప్పటికీ ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గురువులు కురుమయ్య, బెల్లం సాయులు, తిర్మలయ్యచారి, యూసుఫ్, చింతలయ్యను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

నాణ్యమైన విత్తనాలతో ఆశించిన దిగుబడి

అమరచింత: వానాకాలం పంటల సాగు వ్యవహారంలో రైతులు విత్తనాల కొనుగోలు వ్యవహారంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటను సాగు చేస్తే ఆశించిన దిగుబడి సాధ్యమని ఏఈఓ రాజేష్,మల్లేష్‌లు తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లే, చంద్రగడ్, గ్రామాల్లో వ్యవసాయ సాగు విషయాలపై రైతులకు, రైతు కూలీలకు అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలను నాటే సమయంలో పంట పొలాలను ఎలా దుక్కి దున్నుకోవాలో అన్న విషయాలను రైతులకు వివరించారు.

బాధితులకు ఎల్ఓసీ అందజేత



సీఎం సహాయ నిధి ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్ఓసీలను ఎమ్మెల్యే బాధితులకు బుధవారం అందజేశారు. రాజోళి మండలం పెద్ద ధన్వాడకు చెందిన చాముండేశ్వరి అనే మహిళ వైద్యం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా ఆపరేషన్ కోసం రూ.5లక్షల ఎల్ఓసీ రావడంతో కుటుంబ సభ్యులు పరమేష్‌గౌడ్‌కు అందజేశారు. అయిజ మండలం ఏక్లాపూర్ గ్రామానికి చెందిన నరసింహులుకు రూ.4లక్షల ఎల్ఓసీ రావడంతో కుటుంబ సభ్యుడు నాగరాజుకు అందజేశారు. వారితోపాటు నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, నీలప్ప, రాజేందర్, ప్రసాద్, పరశురాముడు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మానవపాడు: ఎర్రవల్లి మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వెంకట్ రెడ్డి తల్లి లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో మరణించారు. బుధవారం అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట వెంకట్‌రాంరెడ్డి, గిడ్డారెడ్డి, రవిప్రకాశ్, శ్రీనివాసరెడ్డి, కృష్ణ, ధర్మారెడ్డి, నరసింహారెడ్డి, గిరిధర్ రెడ్డి, నాగేష్ ఉన్నారు.

ఆకతాయిలపై అప్రమత్తంగా ఉండాలి



బాలికలకు అవగాహన కల్పిస్తున్న హనిమిరెడ్డి

రాజోళి: బాలికలను ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తుంటారని, అలాంటి వారిపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి హనిమిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో కిషోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ ఖాజా మొయినొద్దీన్, కానిస్టేబుల్ రామాంజనేయులు మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను ఏవిధంగా కనిపెట్టాలి, వారి ప్రవర్తన ఎలా ఉంటుందనే అంశాలపై క్లుప్తంగా వివరించారు. వారు అల్లరి చేసే సమయంలో ఎలా ప్రతిఘటించాలి, సమాచారం ఎలా అందించాలనే అంశాలను తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోను ధైర్యం, ఆత్మస్థైర్యం కోల్పోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ సభ్యులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామికి అభిషేకం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రాజోళి: మండల కేంద్రంలోని తుంగభద్ర నది మధ్యలో కొలువైన రామలింగేశ్వర స్వామికి భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజోళితో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి గంగాభిషేకం, బిల్వాభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు అర్చనలు నిర్వహించారు. అనంతరం శివ భక్తులు స్వామి వారి భజనలు, సంకీర్తనలు ఆలపించారు. గత వారంలో ఆలయ అభివృద్ధికి కృషి చేసిన భక్తుల పేరు మీద పూజలు నిర్వహించారు.

మొక్కలకు గుంతలు సిద్ధం చేయండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఖిల్లాఘనపురం: మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్ల వెంట మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ వెంకటాచారి తెలిపారు. బుధవారం మండలంలోని వెనికితండా, మామిడిమాడ గ్రామాల్లో పర్యటించిన ఆయన ఉపాధి పనులు, ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు పరిశీలించారు. ఉపాధి సిబ్బంది, కూలీలతో మాట్లాడి అక్కడి సమస్యలు పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్నందున అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం, పాటుకాల్వలు, చెరువుకాల్వల్లో గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించడం లాంటి పనులు చేపట్టాలని తెలిపారు. గుంతలు సిద్ధం చేయడం వలన వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు ఉపయోగంగా ఉంటుందన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

చిన్నంబావి: మండలంలోని పెద్దమారు, పెద్దదగడ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ రమణరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమన ఉపాధి కూలీల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. కొన్ని రోజులు వాతావరణం చల్లబడినా.. తిరిగి ఎండల వేడి పెరుగుతున్నందున పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కొలతల ప్రకారం పని వివరాలను పక్కాగా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. పని ప్రదేశంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

నిరంతరం విద్యుత్ అందించడమే లక్ష్యం

- చెట్ల కొమ్మల తొలగింపు, ఇన్స్‌లేటర్ల మార్పు



గద్వాల పట్టణంలో విద్యుత్ తీగలను అనుకొని ఉన్న చెట్లను తొగిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

గద్వాల అర్బన్: గాలివాన రాకడ, కరెంటు పోకడ అన్నట్టు ఉంది. సాధారణంగా వర్షకాలంలో కరెంటు లేకపోతే గృహ, వాణిజ్య, పరిశ్రమ, వ్యవసాయ రంగాలకు ఇబ్బందిగా మారుతుంది. గద్వాల పట్టణంలో నిరంతరం విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ఆ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. చెట్ల కొమ్మల తొలగింపు, ఇన్స్‌లేటర్ల మార్పు చేస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి అంతరాయం ఏర్పాడకుండా ముమ్మర చర్యలు చేపడుతున్నారు. వర్షాలు పడినప్పుడు సమస్యలు తలెత్తకుండా తీగలు కింద ఉన్న చెట్లను కొద్ది రోజులుగా తొలగిస్తున్నారు. గద్వాల పట్టణం పరిధిలో 33కేవీ 2 ఫీడర్లు, 11కేవీ 11ఫీడర్ల ఉన్నాయి. అయితే వర్షాలు పడుతున్న నేపథ్యంలో 7ఫీడర్ల పరిధిలో చర్యలు చేపట్టారు. ముందస్తుగా ప్రక్రియలో భాగంగా గత కొన్ని రోజులుగా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు కొట్టేయడం ప్రారంభమైంది. వర్షాలతో ఎక్కువ శాతం ఇన్స్‌లేటర్ల చేడిపోతాయి. లైన్లలో స్తంభాల వద్ద ఉండే ఇన్స్‌లేటర్లు, విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండే స్థానంలో కొత్తవి బిగించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. కాలనీల్లో లూజుగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేశారు. వర్షాలు, ఈదురు గాలుల వల్ల చెట్ల పడి కింద పడిన స్తంభాలను యథావిధిగా ఉండేలా చర్యలు చేపట్టారు. త్వరలో మరిన్ని కాలనీల్లో సైతం పూర్తి చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు కార్యచరణ రూపొందించారు. ఈదురు గాలులతో కింద పడిన విద్యుత్ తీగలను సరి చేసేందుకు ఆశాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.



స్తంభాలను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

తీగలకు తగిలే చెట్లను తొలగించాం

రాబోయే వర్షాకాలం నేపథ్యంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరాఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. అవసరమైన చోట స్తంభాలను ఏర్పాటు చేస్తున్నాం. వర్షాకాలంలో ఎక్కువ శాతం ఇన్స్‌లేటర్లు పోతాయి. అందుకే చాలా వరకు కొత్తవి ఏర్పాటు చేశాం. పాతహౌసింగ్ బోర్డు, లింగంబావి, రెండో రైల్వేగేటు ప్రాంతాల్లో అత్యధికంగా విద్యుత్ తీగలకు అనుకొని ఉన్న చెట్లను తొలగించాం. పట్టణంలోని చాలా కాలనీల్లో లూజు లైన్లు సరి చేసి, చెట్ల కొమ్మలను తొలగించాం. వర్షాకాలంలో ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతాం.

– శివకుమార్, విద్యుత్‌శాఖ ఏఈ, గద్వాల టౌన్